క్లుప్తంగా

అన్నసమారాధన



అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తుల

భీమవరం(ప్రకాశంచౌక్): పట్టణంలోని గునుపూడి దుర్గమ్మ వీధిలో కనకదుర్గమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కొత్తపల్లి విక్టర్ బాబు, సంఘ సేవకులు అల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ జగన్మాత ఆశీస్సులతో సమాజం సుఖశాంతులతో వర్ధిల్లుతుందన్నారు. విక్టర్‌బాబుని పెద్దలు కర్రి అచ్యుతరామయ్య సత్కరించారు. సభ్యులు కొయ్యాని శ్రీనివాస్, కొయ్యని వెంకన్న, నరం శివయ్య, చిన్న రెడ్డి, వెలగడ బ్రదర్స్ పాల్గొన్నారు.

పుంత రహదారి పరిశీలన



పుంత రోడ్డును పరిశీలిస్తున్న ఆర్డీఓ రాజు

పాలకోడేరు: విస్సాకోడేరులోని బందరు పుంత రహదారిని భీమవరం ఆర్డీవో దాసిరాజు ఆదివారం పరిశీలించారు. పుంత ఆక్రమణలకు గురి కాగా ఇటీవల స్థానిక రైతులు రహదారిని అభివృద్ధి చేశారు. రైతుల ఆహ్వానం మేరకు ఆయన పరిశీలించి రైతులను అభినందించారు. ఐక్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చన్నారు. తహసీల్దార్ షేక్ హుస్సేన్, ఆర్ఐ ఎం.నాగభూషణం నాయుడు, వీఆర్వో ఎస్.శాంతారావు ఉన్నారు.

ఏక్ భారత్ శ్రేష్ట్ క్యాంప్‌నకు ఎంపిక



విద్యార్థి రాంబాబును అభినందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: ఏక్ భారత్ శ్రేష్ట్ క్యాంప్‌నకు డీఎన్నార్ కళాశాల ఎన్‌సీసీ సీనియర్ డివిజన్ కాడెట్ పి.రాంబాబు ఎంపికైనట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సీహెచ్ జె.సోమరాజు చెప్పారు. ఆదివారం కళాశాలలో విద్యార్థి రాంబాబును అభినందించిన సందర్భంగా వివరాలను తెలిపారు. ఈనెల 25వ తేదీ నుంచి 12 రోజుల పాటు పంజాబ్‌లోని రూప్‌నగర్‌లో ఏక్ భారత్ శ్రేష్ట భారత్ క్యాంప్ నిర్వహించనున్నారన్నారు. కళాశాల పాలకవర్గ ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు, ఏవో పి.రామకృష్ణంరాజు, ఎన్‌సీసీ ఆఫీసర్ ఎ.వీరయ్య, సీహెచ్ హేమసుందర్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులను దాతలు ప్రోత్సహించాలి



ఆకివీడులో విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేసిన దృశ్యం

ఆకివీడు: ప్రతిభ కలిగిన పేద విద్యార్థులను దాతలు ప్రోత్సహించాలని విజిలెన్స్ డీఎస్పీ ఎస్.వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలో లయన్స్ చారిటబుల్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వెంకటేశ్వరరావు మాట్లాడారు. దాతలు స్పందించి విద్యార్థులకు మరింత ప్రోత్సాహాన్ని అందించాలన్నారు. అనంతరం ఎంబీబీఎస్, ఫార్మసీ, ఇంజనీరింగ్, ట్రిపుల్ ఐటీ చదువుతున్న ఎనిమిది మందికి రూ.2.50 లక్షలు ఆర్థిక సహాయం అందించారు. చదువు పూర్తయ్యేవరకూ సహాయం అందించడానికి ముందుకు వచ్చిన లయన్స్ ప్రతినిధులను అభినందించారు. సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు జిల్లా మాజీ గవర్నర్ డాక్టర్ ఎంవీ.సూర్యనారాయణరాజు, గొట్టుముక్కల జానకీ రామరాజు, కోశాధికారి భూపతిరాజు రంగరాజు పాల్గొన్నారు.

మహిషాసుర మర్దనీ అలంకరణలో అమ్మవార్లు



మహిషాసుర మర్దనీ అలంకరణలో పంచారామక్షేత్రం పార్వతీ అమ్మవారు



కనకదుర్గమ్మ అలంకరణలో ఆకివీడు పెద్దింటి అమ్మవారు



పాములపర్రులో దుర్గాదేవిగా కనకదుర్గమ్మ అమ్మవారు



మాలవానితిప్పలో చండీ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్): శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా 8వ రోజు ఆదివారం అమ్మవార్లు మహిషాసుర మర్దనీ అలంకరణలో ప్రత్యేక పూజలు అందుకున్నారు. అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భీమవరం పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆలయ సహాయ కమిషనర్ యర్రంశెట్టి భద్రాజి పర్యవేక్షణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం అమ్మవారు మహిషాసుర మర్దనీ అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జునశర్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, కుంకుమ పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పంచారామక్షేత్రంలో కొలువైన శ్రీపార్వతి దేవి అమ్మవారికి ఆదివారం మహిషాసుర మర్దనీ అలంకరణ నిర్వహించారు. అలాగే శ్రీఉమాసోమేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి డి.రామకృష్ణంరాజు, ఆలయ ధర్మకర్తలు, అర్చకులు పాల్గొన్నారు. నాచువారి సెంటర్లో వేంచేసియున్న శ్రీకనకదుర్గమ్మవారికి ఆదివారం నవదుర్గల అలంకరణ నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు పవన్, నిర్వాహకులు ఒంటెద్దు బళ్ల సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

కనకదుర్గగా పెద్దింటి అమ్మ

ఆకివీడు: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు కనకదుర్గమ్మగా అలంకరించి భక్తులు పూజించారు. స్థానిక పెద్దింటి అమ్మవారి ఆలయంలో, వనువులమ్మ వారి ఆలయంలో, రాజరాజేశ్వరి ఆలయంలోనూ కనకదుర్గమ్మ అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు, కుంకుమార్చనలు, లలితా సహస్ర పారాయణం నిర్వహించారు. ఆదివారం దుర్గమ్మను దర్శించుకునేందుకు భక్తులు ఆలయాల వద్ద బారులు తీరారు.

పెద్దింటి అమ్మకు జలాభిషేకం

ఆకివీడు: ఆకివీడులోని తీగలదొడ్డిలో వేంచేసియున్న పెద్దింటి అమ్మవారికి మహిళలు ఆదివారం జలాభిషేకం చేశారు. ఈ నెల 20 నుంచి జరుగుతున్న 31వ వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం మహిళలు పసుపు, వేపాకులు నీళ్ళలో కలిపి నింపిన బిందెలతో ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి (గరగ) జలాభిషేకం చేశారు. తొలుత గ్రామ దేవత పెద్దింటి అమ్మవారి ఆలయానికి మహిళలు కుంకుమతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించిన కుంకుమతో మళ్లీ ఊరేగింపుగా తీగలదొడ్డి వరకూ వచ్చి అమ్మవారిని నెలకొలిప్న ప్రాంతంలో పూజలు చేశారు. ఈ నెల 23న అమ్మవారి జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించి, మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్ని నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, కౌన్సిలర్ దొడ్డి జగదీష్ ప్రారంభించినట్లు నిర్వాహకులు ఊడిగ శ్రీనివాస్ చెప్పారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు కౌన్సిలర్ గేదల అప్పారావు, ఉత్తరిల్లి నర్సింహరాజు, సప్పా మణికంఠల ఆధ్వర్యంలో ఉత్సవాల్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారు.

దుర్గాదేవిగా అమ్మవారి దర్శనం

ఉండి: దసరా నవరాత్రులను పురస్కరించుకుని నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం కనకదుర్గమ్మ అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కుంకుమపూజ కార్యక్రమాల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మాలవానితిప్పలో చండీ హోమం

కాళ్ల: మాలవానితిప్పలో దసరా నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి వేదమంత్రాలు నడుమ చండీహోమం నిర్వహించారు. ఉదయం శ్రీలక్ష్మీ అమ్మవారికి పంచామృత శ్రీచక్ర అభిషేకం, కలశ స్థాపన, మండపారాధన కార్యకమాలు నిర్వహించారు. సర్పంచ్ సాగిరాజు సుబ్బరాజు ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమ పూజలు, నీరాజన మంత్రపుష్పములు, ప్రసాద వినియోగం, తీర్థ గోష్టి జరిపారు. గ్రామ పెద్దలు రంగరాజు, భవాని మాలధారులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



నవదుర్గల అలంకరణలో నాచువారి సెంటర్‌లో కనకదుర్గమ్మవారు



ఆకివీడులో వనువులమ్మ అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



ఆకివీడు తీగలదొడ్డిలో వేంచేసియున్న పెద్దింటి అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న మహిళలు, భక్తులు

ప్రజల రక్షణే ధ్యేయంగా పోలీసు సేవలు



భీమవరం వన్‌టౌన్ స్టేషన్ వద్ద పోలీసు అమరవీరుల దినోత్సవ దృశ్యం

సాక్షి, భీమవరం: పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణకు పనిచేస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించేవారిపై కఠినంగా వ్యవహరిస్తారు తప్ప ఎవరిపైనా ప్రత్యేకంగా కక్షసాధింపు ఉండదని భీమవరం వన్‌టౌన్ సీఐ ఆడబాల శ్రీను అన్నారు. పోలీసు శాఖ, శ్రీవిజ్ఞానవేదిక సంయుక్త ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం వన్‌టౌన్ పోలీసుస్టేషన్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పోలీసులు ఎల్లప్పుడు ప్రజల రక్షణే ధ్యేయంగా పనిచేస్తారన్నారు. ట్రాఫిక్ సీఐ దాస్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో పోలీసులు నిరంతరం కృషి చేస్తారన్నారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, డీఎన్నార్ కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ ఎ.వీరయ్య, పి.అమూల్యారావు, ఎస్.కోటేశ్వరరావు, యింటి సత్యనారాయణ, పంపన గోపి, కడలి హరిబాబు పాల్గొన్నారు.

25న మోగల్లులో గ్రామసభ

పాలకోడేరు: మోగల్లు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఈ నెల 25న ఉదయం పదిన్నర గంటలకు గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు వీఆర్వో పంపన సురేష్ తెలిపారు. ఈ గ్రామసభలో రీసర్వేకు సంబంధించి రైతుల పేర్లు చదువుతారని, సరి చూసుకోవాలన్నారు. రైతులు అందరూ గ్రామసభకు హాజరుకావాలని సురేష్ కోరారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఉండి: గ్రామాల అభివృద్ధికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. ఆదివారం ఉణుదుర్రులో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో నిర్మాణం చేపట్టిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. గ్రామంలోని ఎస్సీ పేటలో రూ.14 లక్షలు, గ్రామ శివారు సాగుపాడులో రూ.3 లక్షలు, మెయిన్ విలేజ్‌లో రూ.3 లక్షలు మొత్తం రూ.20 లక్షలతో నిర్మాణం పూర్తి చేసిన సీసీ రోడ్లను సర్పంచ్ పిన్నంరాజు నాగలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు అల్లూరి మాధవి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జీ సుందర్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజలకు అందుతున్న సంక్షేమాన్ని తెలుసుకోవడంతో పాటు ప్రజల సమస్యలను కూడా గుర్తిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తించిన సమస్యలపై చర్చించి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.20 లక్షల నిధులతో ప్రాధాన్యతా క్రమంలో వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. ఇలా రాష్ట్ర ప్రభుత్వం వెనువెంటనే గ్రామ సమస్యలు పరిష్కరిస్తోందన్నారు. ప్రజాసమస్యలను గత ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదని, శంకుస్థాపనల పేరుతో కొబ్బరికాయలు కొట్టి నియోజకవర్గ ప్రజలను టీడీపీ నేతలు మోసం చేశారన్నారు. సమస్యలన్నింటినీ పరిష్కరిస్తున్నారంటూ తెలుగు తమ్ముళ్లు చేసిన దొంగ ప్రచారం చేశారన్నారు. కానీ చెప్పింది చెప్పినట్టు చేసి ప్రజల ముందుకు వెళుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయా గ్రామాల్లో ఎంతో గౌరవం దక్కుతోందన్నారు. సర్పంచ్ పిన్నంరాజు నాగలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు అల్లూరి మాధవి, గ్రామ పార్టీ అధ్యక్షుడు కూనపరాజు వర్మ, జీ సుందర్‌కుమార్, దాట్ల కామరాజు, గెడ్డం సత్య, బండి మధు, మాజీ సర్పంచ్ పైలా సత్యనారాయణ, గోపే మనోహర్ పాల్గొన్నారు.



ఉణుదుర్రులో సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న పీవీఎల్

ఆప్కాబ్ సహకారంతో సహకార ఉద్యోగులకు శిక్షణ



ఆప్కాబ్ రాష్ట్ర డైరెక్టర్ రాజయ్య చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకుంటున్న సుబ్బారావు

సాక్షి, భీమవరం: రైతుల అవసరాలను తీర్చడంతో సొసైటీలు కీలకపాత్ర పోషించనున్నాయని సహకార సంఘాల ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి నందమూరి సుబ్బారావు అన్నారు. కేంద్ర ప్రభుత్వ న్యాయ మంత్రిత్వ శాఖ మూడు రోజుల పాటు ఆప్కాబ్ సహకారంతో హైదరాబాద్‌లో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న సుబ్బారావు ఆదివారం భీమవరంలో వివరాలను వెల్లడించారు. దొంగ నోట్లు, దొంగ బంగారం గుర్తింపు, క్యాష్ మేనేజ్‌మెంట్ తదితర విషయాలపై శిక్షణ ఇచ్చారన్నారు. సీఎస్సీ ద్వారా గ్రామీణ ప్రాంతాలలోని ప్రజానీకానికి అవసరమైన అన్ని సేవలు అందుబాటులోకి రానున్నాయని సహకార సంఘాలు ఉచిత న్యాయ సలహాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇప్పటికే సహకార సంఘాల కంప్యూటరీకరణ కీలక దశకు చేరుకుందన్నారు. శిక్షణలో పాల్గొన్న ఉద్యోగులకు ఆప్కాబ్ రాష్ట్ర డైరెక్టర్ రాజయ్య చేతుల మీదుగా సర్టిఫికెట్స్ అందజేసినట్లు సుబ్బారావు చెప్పారు.

బ్రాహ్మణులంతా సీఎం జగన్ వెంటే

ఉండి: రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా పీకే రావును నియమించడం ద్వారా బ్రాహ్మణులంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉండి, ఆయన ఆశయాలు నెరవేస్తారని వేదవిజ్ఞాన పరిషత్, బ్రాహ్మణ శక్తిపీఠం రాష్ట్రాధ్యక్షుడు డీవీ బాలసుబ్రహ్మణ్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రాహ్మణ శక్తిపీఠం రాష్ట్ర గౌరవాధ్యక్షుడైన పీకే రావును బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడంపై శక్తిపీఠం సభ్యులు రాష్ట్ర వ్యాప్తంగా సీయం జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారన్నారు. పీకే రావు కులమతాలకు అతీతంగా చేస్తున్న సామాజిక సేవలను సీఎం గుర్తించి ఆయనకు ఉన్నత పదవి ఇచ్చి గౌరవించారన్నారు. ఆయనకు లభించిన గౌరవంతో బ్రాహ్మణులంతా సీఎం జగన్ ఆశయాలను నెరవేర్చేలా అండగా ఉంటామన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా బ్రాహ్మణులకు రాష్ట్ర ప్రభుత్వం చేయతలపెట్టిన ప్రతి కార్యక్రమాన్ని తామంతా ప్రజల్లోకి తీసుకువెళతామని బాలసుబ్రహ్మణ్యం తెలిపారు.

నేడు శివ ఉద్యాన వనం ప్రారంభం

ఉండి: ఉండిలో వేంచేసియున్న పార్వతీ సమేత చెన్నమల్లేశ్వరస్వామి, స్వయంభూ మహిషాసురమర్దని అమ్మవారి ఆలయ ఉత్తర భాగాన శివ ఉద్యానవనాన్ని సోమవారం ఉదయం ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు ప్రారంభిస్తారని ఆలయ ప్రధాన అర్చకుడు చలపతిరావు ఆదివారం తెలిపారు. పురాణ గ్రంథాలు, ఇతిహాసాల్లో ఉండే వివిధ రకాలైన మొక్కలను ఈ ఉద్యానవనంలో పెంచేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

బీజేపీతో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదు

ఆకివీడు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తొమ్మిదేళ్లు గడిచినా రాష్ట్రానికి ఒరగబెట్టింది ఏమీ లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారామ్ విమర్శించారు. ఆకివీడులో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి విస్తృత సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టుకు నిధులు, విశాఖ రైల్వే జోన్ వంటివాటిని పూర్తి చేయడంలో కేంద్రం విఫలమైందని ఆరోపించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, విద్యుత్ ధరల్ని భారీగా పెంచి రాష్ట్ర ప్రభుత్వంపై ఆంక్షలు విధించడం దారుణమన్నారు. ఈ సమస్యలపై పోరాడేందుకు ప్రజా రక్షణభేరి, బస్ యాత్రలతో పాటు, నవంబర్ 15న విజయవాడలో జరిగే ర్యాలీ, బహిరంగ సభల్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి బి.బలరామ్, జేఎస్వీ గోపాలన్ పాల్గొన్నారు.

8 మంది జూదరుల అరెస్టు

పాలకోడేరు: కొండేపూడి శివారు పంట పొలాల మధ్య పేకాట ఆడుతున్న 8 మంది జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్సై నాళం శ్రీనివాసరావు ఆదివారం చెప్పారు. వీరి నుంచి నుంచి రూ.3,800 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వన్‌టౌన్‌లో చోరీ

సాక్షి, భీమవరం: వన్‌టౌన్ పరిధిలోని ఎఫ్‌సీఐ గోడౌన్స్ సమీపంలోని ఓ ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. సీఐ అడబాల శ్రీను తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇంటి యజమాని తాళాలు వేసి బయట బల్లపై ఉంచగా.. ఇంట్లో ఉండాల్సిన రూ.40 వేల నగదు, 3 కాసుల బంగారం అపహరణకు గురయ్యాయి. తాళాలు పగలగొట్టలేదని, తాళం చెవితో తీసినట్టుగా ఉండడంతో వివరాలు సేకరిస్తున్నామని సీఐ తెలిపారు.

మహిళకు తీవ్ర గాయాలు

భీమవరం అర్బన్: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. భీమవరం డీఎన్నార్ కళాశాల సమీపంలో నివాసం ఉంటున్న శీలం శుభశ్రీ ఈ నెల 18న భర్త శీలం బాలాజీతో కలిసి బైక్‌పై అనాకోడేరు వెళ్లి తిరిగి వస్తోంది. రాయలం వెళ్లే మలుపులో ఎదురుగా వస్తున్న మరో బైక్ వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో శుభశ్రీకి తీవ్ర గాయాలు కాగా, భీమవరం తరలించారు. హెచ్‌సీ పి.మహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేగంగా పక్కా డ్రెయిన్ నిర్మాణం



డ్రెయిన్ నిర్మిస్తున్న దృశ్యం

ఆకివీడు: శివారులో ఏళ్ల తరబడి కనీస వసతులు లేని పలు ప్రాంతాలు 'గడపగడపకు మన ప్రభుత్వం' నిధులతో అభివృద్ధికి నోచుకుంటున్నాయి. చినకాపవరం శివారు మహాలక్ష్మీపురం, దండగర్ర ప్రాంతాల్లో మూడు నెలల క్రితం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సందర్భంగా డ్రెయినేజీ సమస్యను ప్రజలు పీవీఎల్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో తక్షణం రూ.5 లక్షలు కేటాయించారు. ఈ పనుల్ని శుక్రవారం ప్రారంభించగా వేగంగా జరుగుతున్నాయి. సర్పంచ్ నాతిరెడ్డి ఆదిలక్ష్మి, జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు (యండగండి శ్రీను), పార్టీ గ్రామ అధ్యక్షులు నాతిరెడ్డి అన్నవరం పనులను పర్యవేక్షిస్తూ వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు.